ఫలించిన సమష్టి వ్యూహం

- పెందుర్తి ప్రాంతంలో విరివిగా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు
- అనధికారిక పార్కింగ్.. రాంగ్ రూట్‌లకు చెక్
- సిగ్నల్ వ్యవస్థ పునరుద్ధరణ
- గణనీయంగా తగ్గిన రోడ్డు ప్రమాదాలు
- సత్ఫలితాలిస్తున్న పోలీసుల చర్యలు


రాంగ్ పార్కింగ్ వాహనానికి తాళం వేస్తున్న పోలీసులు


పెందుర్తి సమీపంలో వేస్తున్న స్పీడ్ బ్రేకర్లు



బీఆర్‌టీఎస్ రహదారి మధ్య మార్గంలో ఏర్పాటు చేసిన నో ఎంట్రీ బోర్డు (ఫైల్)

పెందుర్తి: రోడ్డు ప్రమాదాలు ఎంతో మందిని బలితీసుకుంటున్నాయి.. మరెంతో మందిని దివ్యాంగులుగా మారుస్తున్నాయి.ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు నడుం బిగించారు. ఈ క్రమంలో పెందుర్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పెందుర్తి ట్రాఫిక్ పోలీసులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. దీని ఫలితమే గతేడాదిలో పెందుర్తి రోడ్లపై ప్రమాదాలు తగ్గుముఖం పట్టడం.

ఇదీ పరిస్థితి

పెందుర్తి ప్రాంతంలో గతంలో ఏడాదికి సగటున 35 నుంచి 45 మంది ప్రాణాలు కోల్పోయేవారు. గత పది నెలలో ఆ సంఖ్య 15కు తగ్గింది. రానున్న రోజుల్లో రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గించాలన్న లక్ష్యంతో ప్రమాదాల నివారణకు అవసరమైన అదనపు చర్యలు తీసుకుంటున్నారు.

పక్కాగా నిబంధనల అమలు

పెందుర్తి మీదుగా ఓ వైపు జాతీయ రహదారి, మరో వైపు బీఆర్‌టీఎస్ రోడ్డు..ఇంకోవైపు అరకు దారి ఉన్నాయి. ఆయా రోడ్లపై వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు పోలీసులు ప్రయాసలు పడే వారు. అనధికారిక పార్కింగ్..సిగ్నల్ వ్యవస్థ నిర్వహణలో అంతర్గత సమస్యలు..వాహన చోదకుల వేగాన్ని నిరోధించలేని పరిస్థితి ఉండేది. దీంతో ప్రమాదాలు తీవ్రస్థాయిలో ఉండేవి. ఈ నేపథ్యంలోఅనందపురం -అనకాపల్లి బైపాస్ రోడ్డు వినియోగంలోకి రావడంతో రవాణా వాహనాల తాకిడి తగ్గింది. దీంతో పెందుర్తి కూడలి..ఇతర మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గుతూ వచ్చింది. ఇదే సమయంలో పోలీసులు సబ్బవరం-పెందుర్తి, పెందుర్తి-ఆనందపురం, పెందుర్తి-కొత్తవలస, పెందుర్తి-విశాఖపట్నం మార్గాల్లో ఆర్ అండ్ బి, జీవీఎంసీ సహకారంతో స్పీడ్ బ్రేకర్లు వేశారు. మరోవైపు సిగ్నల్ వ్యవస్థను పూర్తిగా వినియోగంలోకి తెచ్చారు. బీఆర్‌టీఎస్ మధ్య మార్గంలో ఆర్టీసీ, ఇతర అత్యవసర సర్వీసులు తప్ప మిగిలిన వాహనాలను పూర్తిగా నిరోధించారు. ఈ మార్గంలో నిబంధనలు మీరిన వారికి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. ఇంకోవైపు అనధికారిక పార్కింగ్‌పై కొరడా ఝుళిపిస్తున్నారు. రాంగ్‌రూట్, వేగంగా వాహనాలు నడుపుతున్న వాహన చోదకులకు కళ్లెం వేస్తున్నారు. మందుబాబుల ఆటలు కట్టిస్తున్నారు. కూడళ్ల వద్ద ప్రత్యేక వాహనంపై తెర ద్వారా రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు. దీంతో రికార్డు స్థాయిలో ప్రమాదాల సంఖ్య తగ్గింది.

మూడు సంవత్సరాల్లో ప్రమాదాలు/మరణాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	గాయాలు
2021	120	31	99
2022	150	34	122
2023 (అక్టోబర్ వరకు)	66	15	51

ప్రాణాలు కాపాడడమే మా లక్ష్యం



అతి వేగమో..ఇతర కారణాల వల్లో ఎంతో మంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి విషాదకరమైన ఘటనలకు చెక్ పెట్టడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నాం. స్పీడ్ బ్రేకర్లు వేయిస్తున్నాం. రాంగ్ పార్కింగ్, రాంగ్‌రూట్, హెల్మెట్, సీటుబెల్ట్, డ్రంక్ డ్రైవ్, సిగ్నల్ జంప్ నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నాం. బీఆర్‌టీఎస్ రహదారి మధ్య రోడ్డులో అనుమతి లేని వాహనాలు ప్రవేశిస్తే రూ.1500 వరకు భారీ విధిస్తున్నాం. పది నెలల్లో పెందుర్తి పరిధిలో 1023 డ్రంకన్ కేసు పట్టుకున్నాం. 840 మందికి కోర్టు జరిమానాలు విధించగా ముగ్గురికి జైలు శిక్ష పడింది. వాహనచోదకులు కూడా నిబంధనలు పాటించి సహకరిస్తే ప్రమాదాల సంఖ్య ఇంకా తగ్గించగలుగుతాం.

– జి.రమేష్, ఎస్‌ఐ, ట్రాఫిక్, పెందుర్తి.

పెందుర్తి పీఎస్‌ను సందర్శించిన సీపీ


పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదివారం సందర్శించారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. రౌడీ షీటర్లపై పూర్తిగా నిఘా ఉంచాలని సూచించారు. మహిళలపై ఎలాంటి దాడులు జరగకుండా దిశ యాప్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణపై పలు సూచనలు చేశారు.

8న ఆదర్శ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా

పెందుర్తి: పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 8న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఈ ఫ్లోరా వెల్లడించారు. బీఎస్సీ, బీసీఏ, బీకాం, బీబీఏ, బీఏ, బీటెక్, డిప్లమో, ఐటీఐ, ఇంటర్మీడియట్, పదోతరగతి ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులకు ఐసీఐసీఐ బ్యాంక్, ప్రైసీ గ్లోబల్ టెక్నాలజీ, అస్ట్రోటెక్ స్టీల్స్, బీఎస్ఏ, వెస్ట్ సైడ్ డైకిన్ కంపెనీల్లో ఉపాధికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న అయ్యప్ప మండల దీక్షలు


మాలధారణ చేసిన భక్తులతో గురుస్వామి

పెందుర్తి: సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి మండల దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి గురుస్వామి చేతుల మీదుగా దాదాపు 50 మంది భక్తులు మాలధారణ చేశారు. ముందుగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ నెల 14 నుంచి ఆలయంలో నిత్య అన్నసమారాధన ప్రారంభిస్తామని గురుస్వామి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పరవాడ: మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

11న మాదిగల విశ్వరూప సభ


కరపత్రాలు ప్రదర్శిస్తున్న సామ్రాట్ కుమార్ తదితరులు

సబ్బవరం: హైదరాబాద్‌లో ఈ నెల 11న జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ మండలంలోని పలు గ్రామాల్లో ఆది వారం కరపత్రాలు పంపిణీ చేశారు. పలువురు నాయకులను కలిసి ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నీటిపల్లి ముత్యాలరావు, యువసేన కన్వీనర్ గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భువనేశ్వరీదేవి అధివాసం


దివ్యాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న భువనేశ్వరీదేవి

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీ యాతపాలెం శివారు మణిపురంలో కొలువైన శ్రీభువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి మంగళ స్నానాలు చేయించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అమ్మ వారి సన్నిధిలో నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. చంద్రకాంత పత్రితో అమ్మవారికి అధివాసం నిర్వహించారు.

విశాఖ ఉక్కు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కార్మిక సంఘ నాయకులు, అఖిలపక్షాల నేతలను ప్రధాని వద్దకు తీసుకువెళ్లి స్టీల్ ప్లాంట్ విషయమై స్పష్టమైన ప్రకటన చేసేలా చొరవ తీసుకోవాలన్నారు. కూర్మన్నపాలెంలో ఉక్కు దీక్షలు ఆదివారం నాటికి 996వ రోజుకు చేరుకున్నాయి. ఉక్కు ఉద్యమం ప్రారంభించి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్‌లో ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒత్తిడితోనే ఇది సాధ్యమైందన్నారు. ఏపీ సీఎం కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఆయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, కె.ఎస్.ఎన్.రావు, కారు రమణ, రామస్వామి, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాస్, డి.అప్పారావు, డి.సురేష్‌బాబు, ఇతర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పెందుర్తిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి

భారీ ర్యాలీ చేపట్టిన పెందుర్తి ప్రాంతవాసులు


రైల్వే అధికారులకు వినతిపత్రం అందిస్తున్న పెందుర్తి పరిరక్షణ సమితి ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి రైల్వే స్టేషన్ మీదుగా వెళుతున్న అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని కోరుతూ పెందుర్తి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పరిసర వాసులు ఆదివారం భారీ ర్యాలీ చేపట్టారు. బీఆర్‌టీఎస్ రహదారి నుంచి రైల్వే స్టేషన్ వరకు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ పెందుర్తి పరిసర ప్రాంతాల్లో దాదాపు 2 లక్షల మంది జనాభా ఉన్నారని కానీ ఈ స్టేషన్‌లో కేవలం పాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటుగా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపితే పెందుర్తి ప్రాంతంతో పాటు ఆనందపురం, సబ్బవరం, కె.కోటపాడు, చోడవరం, చీడికాడ మండలాల ప్రజలకు కూడా ఉపయోగపడుతుందన్నారు. అంతే కాకుండా పెందుర్తికి అతి సమీపంలో జాతీయ లా యూనివర్సిటీ, పెట్రో యూనివర్సిటీ, జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్నాయని చెప్పారు. మరో వైపు పెందుర్తి మీదుగా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కాలంటే ఇటు పది కిలోమీటర్ల దూరం ఉన్న కొత్తవలస లేదా 20 కిలోమీటర్లు దూరంలో ఉన్న విశాఖ వెళ్లాల్సి వస్తుందన్నారు. దీని వల్ల అత్యవసరంగా విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, ఒడిశా, భువనేశ్వర్, పూరీ, కోల్‌కతాతో పాటు తుని, రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పెందుర్తిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పెందుర్తి రైల్వే స్టేషన్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


సభకు హాజరైన ప్రజలు

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పరవాడ: నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాలకు భరోసా లభించిందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన సీఎంగా ఘనత దక్కించుకున్నారన్నారు. అలాంటి సంక్షేమ సారథిని మరో సారి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం భర్నికం, తానాం గ్రామాల్లో అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ఆత్మస్థైర్యంతో జీవించగలుగుతున్నారంటే అందుకు జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే కారణమన్నారు. నాలుగేళ్లలో రూ. 11.91 కోట్లను భర్నికం గ్రామ ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందించామని చెప్పారు. బడుగు బలహీన వర్గాల వారికి ఏ పథకం వర్తింప జేయాలో ఆలోచించి పథకం ప్రకారం వాటిని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, భర్నికం సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్, కన్నూరు ఎంపీటీసీ గొల్లవిల్లి శ్రీనివాసరావు,నాయుడుపాలెం సర్పంచ్ కె.వరలక్ష్మిసీతారామయ్య, నాయకులు బండారు రాజశేఖర్, జె.కనకరాజు, పైల అప్పలనాయుడు, డెక్క శ్రీనివాసరావు, కె.భాస్కర్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడికి ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కుటుంబ సమేతంగా ఈ పూజలో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడ సేవని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై అదిష్టింపజేశారు. అష్టోత్త శతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

అప్పన్నను దర్శించుకున్న ఇరాన్ అధికారి


అప్పన్న సన్నిధిలో డాక్టర్ ఫరిబోర్జ్ అబ్బాసి తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఇరాన్ ప్రభుత్వ వ్యవసాయ మంత్రి సలహాదారు డాక్టర్ ఫరిబోర్జ్ అబ్బాసి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ ఆయనకు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజా రక్షణ భేరిని విజయవంతం చేయండి


ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు

పరవాడ: విజయవాడలో ఈ నెల 15న నిర్వహించనున్న ప్రజారక్షణభేరి సభను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ఆదివారం పరవాడ మండలంలో అడుగు పెట్టిన సందర్భంగా ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, సీహెచ్.నరసింగరావు మాట్లాడుతూ విజయవాడలో జరగనున్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభకు మూడు ప్రాంతాల నుంచి బస్సు యాత్రలు బయలుదేరాయన్నారు. శ్రీకాకుళం జిల్లా మందస నుంచి ఈ నెల 2న ప్రారంభమైన బస్సు యాత్ర ఆదివారం పరవాడ మండలంలో అడుగు పెట్టిందన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. స్థానికులకు 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, నరసింగరావు, కె.లోకనాథం, ఎం.హరిబాబు, కె.ధనలక్ష్మి, జిల్లా నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వి.వి.రమణ, పి.మాణిక్యం వ్యర్థాలతో నిండిన పరవాడ పెద్ద చెరువును పరిశీలించారు.

స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో భారీ చోరీ


ఇంట్లో చిందర వందరగా పడి ఉన్న వస్తువులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని క్వార్టర్స్‌లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ విభాగంలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. శ్రీనివాస్ టౌన్‌షిప్ సెక్టార్-1లోని 149-డీ క్వార్టర్‌లో కుటుంబంతో నివసిస్తున్నారు. యథావిధిగా శనివారం రాత్రి తలుపులు వేసి పడుకున్నారు. తెల్లవారి లేచి చూడగా ఇంటి హాల్లో వస్తువులు చిందర వందరగా పడిఉన్నాయి. ప్రధాన ద్వారం ముందు వైపు గడియ పెట్టి ఉంది. తనిఖీ చేయగా ఇంట్లో ఉండాల్సిన సుమారు 10 నుంచి 12 తులాల బంగారం వస్తువులు, 10 తులాల వెండి వస్తువులు, రెండు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ మాయమయ్యాయి. దీంతో వారు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. క్రైం ఎస్‌ఐ ఎల్. శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు. దొంగలు దిగువన ఉన్న పైపును పట్టుకుని పైఅంతస్తుకు వచ్చి వెనుక ద్వారం గుండాలోనికి ప్రవేశించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఉద్యోగి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

సోమవారం నుంచి 12వ తేదీ వరకు గుంటూరు-రాయగడ (17243)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 13వ తేదీ వరకు రాయగడ-గుంటూరు (17244)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 12వ తేదీ వరకు మచిలీపట్నం-విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్,13వ తేదీ తేదీ వరకు విశాఖ-మచీలీపట్నం (17220)ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు విజయవాడ- విశాఖ- విజయవాడ (12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు కాకినాడ-విశాఖ- కాకినాడ (17267/17268) మెము స్పెషల్ రైళ్లు రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు

సోమ,మంగళవారాల్లో విశాఖలో బయల్దేరే విశాఖ-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్-విశాఖ (18513)ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 9తేదీల్లో కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. సోమ, మంగళవారాల్లో హౌరాలో బయల్దేరే హౌరా-జగదల్‌పూర్ (18005)సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ కొరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ - హౌరా(18006) ఎక్స్‌ప్రెస్‌గా 7,8 తేదీలలో కోరాపుట్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

నాందేడ్ -విశాఖపట్నం రీషెడ్యూల్

ఆదివారం నాందేడ్‌లో సాయంత్రం 4.30గంటలకు బయల్దేరవలసిన నాందేడ్-విశాఖ(20812) సూపర్‌ఫాస్ట్ స్పెషల్ పెయిరింగ్‌రైలు రాక ఆలస్యంగా రాత్రి 8.30గంటలకు బయల్దేరింది.

పినగాడిలో నేడు రీ సర్వే ప్రారంభం

పెందుర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేలో భాగంగా సోమవారం పినగాడి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 49, 142 లలో సర్వే నిర్వహించనున్నట్లు వీఆర్వో సుబ్బారావు తెలిపారు. సంబంధిత సర్వే నంబర్లలో భూములు కలిగిన రైతులు తగిన రికార్డులతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

ముగిసిన నిఘా వారోత్సవాలు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధిలో నిఘా వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అవినీతికి అలవాటు పడితే జీవితాలు, కుటుంబాలు ఎలా నష్టపోతాయో ఏయూ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ వివరించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ రైల్వే అధికారులు, సిబ్బందితో భేటీ అయ్యారు. అవినీతికి అలవాటు పడి జీవితాలు ఎలా నాశనం అయ్యాయో నుక్కడ్-నాటక్ వీధినాటికల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార : ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని చిట్టివలస లేబర్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 946వ శిబిరానికి హాజరై ఆయన మాట్లాడారు. నగరంలోని అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులు అందరూ ఒక తాటిపైకి వచ్చి పోరాడుతున్నారన్నారు. లాభాల్లో నడుస్తున్న ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు ముందు తరాలకు ఉపాధి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ అమ్మకానికి పెట్టి దేశాన్ని దివాళా తీయిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ, చిల్లరాం, వై.కొండయ్య, సూరప్పుడు తదితరులు పాల్గొన్నారు.